బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి పనులు



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

బౌద్ధనగర్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి పనులు జోరుగా జరిగాయని బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ అన్నారు. సోమవారం బౌద్ధనగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో పోటాపోటీగా అభివృద్ధి పనులు సాగాయని పేర్కొన్నారు. అందులో భాగంగానే బీఆర్ఎస్ హయాంలో సీసీ రోడ్డు పనులను మంజూరైన రూ. 22 లక్షలతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కేన్సర్ నిర్ధారణ శిబిరం

అడ్డగుట్ట: డివిజన్‌ని సీ అండ్ డీ సెక్షన్ కమ్యూనిటీహాలులో మహిళల కోసం ఉచిత కేన్సర్ నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు జన హిత సేవా ట్రస్ట్ ప్రతినిధి నర్సింగ్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ వెస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి వైద్యులు మహిళలకు గర్భాశయ, రొమ్ము కేన్సర్ గురించి అవగాహన కల్పిస్తారని తెలిపారు.

యజ్ఞపూజ..అన్నదానం



యజ్ఞపూజ కార్యక్రమంలో మర్రి శశిధర్‌రెడ్డి తదితరులు

సనత్‌నగర్: యువమోర్చా నాయకుడు శశాంక్ ఆర్య జయంతిని పురస్కరించుకుని సోమవారం సనత్‌నగర్‌లో యజ్ఞపూజ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిపారు. సీనియర్ నేత దయానంద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, రాష్ట్ర యువనేత మర్రి పురురవరెడ్డి, నాయకులు ఆకుల మహేష్, క్రాంతికుమార్, నరేందర్, సత్యనారాయణ, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనలో ముందుండాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న టీజీపీసీబీ సభ్య కార్యదర్శి రవి

సనత్‌నగర్: సనత్‌నగర్‌లోని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆడిటోరియంలో సోమవారం ఉద్యోగులచే 'కల్చర్ ఆఫ్ ఇంటిగ్రిటీ ఫర్ నేషన్స్ ప్రాస్పెరిటీ'పై ప్రతిజ్ఞ చేయించారు. టీజీపీసీబీ సభ్య కార్యదర్శి రవి హాజరై వారిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు విధి నిర్వహణలో పారదర్శకంగా, నిజాయితీగా ఉండాలని పిలుపునిచ్చారు. అవినీతి నిర్మూలనలో పీసీబీ ఉద్యోగులు ముందుండాలన్నారు. విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సమాచార హక్కు చట్టం 2025 నిబంధనల అమలు తీరుపై సమీక్షించారు. దరఖాస్తుదారుల అభ్యర్థనలను స్వీకరించి సజావుగా సమాచారం అందించాలని సూచించారు. ఆర్టీఐ అధికారుల గురించి తాజా సమాచారాన్ని పోర్టల్‌లో ఉంచాలని ఆదేశించారు. టీజీపీసీబీలో మొత్తం 13 మంది అధికారుల పేర్లను ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో టీజీపీసీబీ సీఈఈ రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు



బన్సీలాల్‌పేట్ శ్మశానవాటికలో వ్యర్థాలను తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పలు హిందూ శ్మశానవాటిల్లో దీపావళి పండుగ సందర్భంగా విస్తృతమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్పొరేటర్ కె. హేమలత చెప్పారు. ఈ నెల 31న దీపావళి పర్వదినం రోజు హిందువులు అనేక శ్మశానవాటికల్లో పూజలు చేస్తూ చనిపోయిన ఆత్మీయులను స్మరించుకుంటారన్నారు. శ్మశానవాటికకు వచ్చే ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్తు, జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో పలు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. శ్మశానవాటిల్లో పెరుగుపోయిన చెత్తా చెదారం, వ్యర్థాలను, ఇతరత్రా గడ్డి తదితర వాటిని తొలగిస్తున్నామన్నారు. అదే విధంగా శ్మశానవాటికల్లో రాత్రి వేళల్లో ప్రజలకు సౌకర్యార్థం విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. డివిజన్‌లోని 7 శ్మశానవాటిల్లో భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేశారు. సోమవారం బన్సీలాల్‌పేట్, బోయిగూడ, బోలక్‌పూర్ తదితర శ్మశానవాటిల్లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో శుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీపతి, నర్సింగ్‌రావు, రమేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో రూపాయల్లో..) టమాటా.35, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 35, బెండకాయ 65, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 70, క్యాప్సికమ్ 75, పచ్చకాకర 45, పందిరి బీర 55, క్యాబేజీ 23, క్యారెట్ 55, దొండ 45, గుండు బీన్స్ 100, గింజ చిక్కుడు 100, గోకరకాయ 55, కీర 31, దోసకాయ 40, బీట్‌రూట్ 35, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 36, చామగడ్డ 37, మొరంగడ్డ 23, కందగడ్డ 65, సొరకాయ 17, పొట్లకాయ 23, అరటికాయ 10, మునగకాయ 3-4, ముల్లంగి 4-6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి

- పద్మారావునగర్ ప్రధాన రహదారిలో తీవ్ర అసౌకర్యం
- పట్టించుకోని అధికారులు



గాంధీ ఆసుపత్రి వెనుకాల పద్మారావునగర్ ప్రధాన రహదారిలో రోడ్డుపై మురికినీటి ప్రవాహం

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్ ప్రధాన రహదారి మురికినీటి ప్రవాహం దుర్వాసనతో కంపు కొడుతోంది. రోజుల తరబడి నుంచి ఈ రహదారి తీవ్ర దుర్వాసనను వెదజల్లుతోంది. దరిమిలా ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. స్థాని ప్రజాప్రతినిధులు ఉదాసీనత, జలమండలి అధికారుల బాధ్యతారాహిత్యం స్థానిక ప్రజలకు శాపంగా మారింది.

- సికింద్రాబాద్ గాంధీ ప్రభుత్వ ఆసుపత్రి వెనుక భాగం పద్మారావునగర్ ప్రధాన రహదారిలో మురికినీరు రోజుల తరబడి నుంచి రోడ్డుపై ప్రవహిస్తున్నది.
- ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగించే పాదచారులు, వాహనచోదకులు, సమీపంలోని అపార్టుమెంట్ వాసులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు.
- ఓ వైపు గాంధీ ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వచ్చే మురికినీరు అదే విధంగా బయటి నుంచి డ్రైనేజీ మురికినీరు ఇక్కడ కలుస్తున్నాయి. పెద్ద ఎత్తున మురికినీటి ప్రవాహంతో ఈ రహదారి అస్తవ్యస్తంగా తయారైయింది.
- స్థానికులు ఉక్కిబిక్కిరి అవుతున్నా పట్టించుకునేనాథుడే కరువయ్యారని స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- జలమండలి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని పలువురు స్థానిక అపార్టుమెంట్ వాసులు, వ్యాపారస్తులు వాపోయారు.

దీపావళినాడు.. తస్మాత్ జాగ్రత్త..

జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



డాక్టర్ రవీందర్‌గౌడ్

సనత్‌నగర్: దీపావళి పండుగ రోజు టపాసులు కాల్చే సందర్భంలో ఎంతోమంది ప్రమాదాలకు గురై ఆస్పత్రుల బాట పడుతున్నారు. సరోజినీదేవి కంటి ఆస్పత్రితో పాటు ఇతరత్రా ప్రైవేటు కంటి ఆస్పత్రులకు వచ్చే వారి సంఖ్య ఏయేటి కాయేడు పెరుగుతూ వస్తోంది. ముఖ్యంగా పిల్లల కళ్లల్లో టపాసుల తాలూకు నిప్పు రవ్వలు పడడమో, లేక శరీరంపై కాలిన గాయాలతో ఆస్పత్రులకు వచ్చి చికిత్స తీసుకుంటున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. అలాంటి పరిస్థితి తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సరోజినీదేవి కంటి ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌గౌడ్ సూచించారు. దీపావళి నాడు ప్రతి సంవత్సరం వందలాది మంది ప్రమాదానికి గురికావడం, వందలాది మంది చూపు కోల్పోవడం జరుగుతుందన్నారు. టపాసులు కాల్చడం వల్ల అంధత్వం పొందుతున్నారని, శబ్ద కాలుష్యం వల్ల చెవిటి సమస్యలు తలెత్తుతున్నాయని, వాయు కాలుష్యం వల్ల ఊపిరితిత్తుల వ్యాధులు ప్రబలుతాయని ఆయన హెచ్చరించారు. జాగ్రత్తలను పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చన్నారు.

- విశాలమైన మైదానంలో పటాకులు కాల్చాలి.
- బక్కెట్ నీళ్ల దగ్గర పెట్టుకుని పటాకులు కాల్చాలి.
- నైలాన్ దుస్తులు ధరించరాదు. కాటన్ దుస్తులు ధరించాలి.
- ప్రమాదకరమైన ఆటమ్ బాంబ్, రాకెట్లు కాల్చరాదు.
- పెద్దల సంరక్షణలో మాత్రమే పిల్లలు పటాకులు కాల్చాలి.
- పిల్లలు శాశ్వతంగా అంధులు కాకుండా తల్లిదండ్రులదే బాధ్యత.
- ఢిల్లీ ప్రభుత్వం టపాసులు కాల్చకుండా నిషేధం విధించింది. వీలైతే అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధం విధిస్తే అన్నివిధాలా మేలు. ముఖ్యంగా ప్రమాదకరమైన టపాసులు, రాకెట్లు, ఆటంబాంబులు నిషేధించాలి.
- చైనా టపాసులు నిషేధించాలి.
- ప్రమాదం జరిగిన వెంటనే దగ్గరలోని కంటి ఆస్పత్రిని సంప్రదించాలి.
- ప్రభుత్వం, తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లయితే ప్రజలకు, ముఖ్యంగా పిల్లలు శాశ్వత అంధులు కాకుండా కాపాడిన వాళ్లమవుతాం.
- అదేవిధంగా కాలుష్యం నుంచి కాపాడుకోవాలంటే మాస్కులు ధరించాలి.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



తహసీల్దార్ భీమయ్యకు వినతిపత్రం సమర్పిస్తున్న తపస్ ప్రతినిధులు

అడ్డగుట్ట: ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని... డీఏ, పీఆర్సీ లను వెంటనే ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు (తపస్) డిమాండ్ చేశారు. రాష్ట్ర శాఖ పిలుపుమేరకు దశల వారి నిరసన కార్యక్రమాలలో భాగంగా సోమవారం సాయంత్రం తపస్ ప్రతినిధులు అడ్డగుట్టలోని మారేడుపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో భీమయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా అధ్యక్షుడు బి. తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు వారి ఖాతాలకు చెల్లించాల్సిన జీపీఎఫ్, మెడికల్ బిల్లులు, సరెండర్ బిల్లులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పెన్షన్ బిల్లులు విడుదల చేయాలన్నారు. అదే విధంగా జీతాలకు సంబంధించిన సప్లమెంటరీ బిల్లులు మొదలైన ఎరియర్స్ బిల్లులు ఈ కుబేర్ ద్వారా రావాల్సిన అనేక పెండింగ్ బిల్లులు పేరుకుపోయి ఉండి అకౌంట్లో జమకాకపోవడం వల్ల ఉపాధ్యాయులు వారి కుటుంబాలు తమ అవసరాల సర్దుబాటుకుఇబ్బంది పడుతున్నారన్నారు. పీఆర్సీ నివేదికను తెప్పించుకోవడం పట్ల తాత్సారం ప్రదర్శిస్తూ జాప్యం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో డీఏ, పీఆర్సీలను ప్రభుత్వం ఏర్పడిన తరువాత తక్షణమే చెల్లిస్తామని చెప్పి ఇంత వరకు ఐదు డీఏలకు ఒక డీఏ మాత్రమే ప్రకటించారన్నారు. కార్యక్రమంలో తపస్ ప్రతినిధులు పవన్ రాజ్, అనురాధ, మారుతి తదితరులు పాల్గొన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో తపస్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, పవన్ రాజు, అనురాధ, మారుతి తదితరులు ఉన్నారు.

ప్రధాన ఉపాధ్యాయ సంఘాలను బహిష్కరించండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని ప్రధాన ఉపాధ్యాయ సంఘాలు టి.పీఆర్టీయూ, యూటీఎస్, టీజీ పీఆర్టీయూలను బహిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ టీచర్లకు విజ్ఞప్తి చేశారు. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అన్ని సంఘాల నాయకులు గత కొన్ని సంవత్సరాలుగా బీసీ, ఇతర వర్గాలను టీచర్లను విస్మరిస్తూ అగ్రకుల అభ్యర్థులనే పోటి చేయిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఆయా సంఘాల్లో 80 శాతం టీచర్లు బడుగు బలహీన వర్గాలు చెందిన వారైన్పటికీ ఎవరికి అవకాశం ఇవ్వకుండ వరుసగా అగ్రకులానికి చెందిన టీచర్లకు పోటీ పోటీచేసే అవకాశం ఇవ్వడం ఉపాధ్యాయాల సంఘాల నియంతృత్వానికి నిదర్శనం అన్నారు. పీఆర్టీయూ అభ్యర్థిగా పింగళి శ్రీపాల్ రెడ్డి, యూటీఎఫ్ నుంచి నర్సిరెడ్డి, టి.పీఆర్టీయూ నుంచి హర్షవర్ధన్ రెడ్డి పేర్లను ఆయా సంఘాలు ప్రకటించడం వారి ఆధిపత్య వైఖరికి నిదర్శనమన్నారు. బీసీ టీచర్లు ఆయా సంఘాల నుంచి బీసీ అభ్యర్థిని పోటీలో నిలిపి ప్రధాన ఉపాధ్యాయా సంఘాలకు బుద్ది చెప్పాలని జాజుల లింగంగౌడ్ ఎస్సీ, ఎస్టీ, బీసీ టీచర్లకు విజ్ఞప్తి చేశారు.

మంత్రి పొంగులేటి వల్లే ప్రజా పాలన



కేక్‌కట్ చేస్తున్న పిడమర్తి రవి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వల్లే గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి ప్రజా పాలనకు దోహదపడిందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి పేర్కొన్నారు. సోమవారం ఓయూ జేఏసీ అధ్యక్షులు బోరెల్లి సురేష్ ఆధ్వర్యంలో మంత్రి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి పిడమర్తి రవి ముఖ్య అతిథిగా హాజరై కేక్‌కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి సీఎం రేవంత్ రెడ్డితో కలసి బీఆర్ఎస్ నియంతృత్వ పాలనకు చరమగీతం పాడారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్ ముదిరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్, జోగు గణేష్, నక్క మహేష్, దేవరకొండ నరేష్, రాజు, అంజి, రేవంత్, మీసాల మహేష్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

ఓయూకు చేరుకున్న ఉద్యమకారుల పాదయాత్ర

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ఉద్యమకారుల ఈ నెల 15న ఆదిలాబాద్‌లో చేపట్టిన పాదయాత్ర సోమవారం ఓయూకు చేరుకుంది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఓయూ ఆర్ట్స్ కాలేజీకి పాదయాత్ర చేపట్టినట్లు యాత్రలో పాల్గొన్న నాయకులు తెలిపారు. పోలీసుల ఆంక్షలు ఉన్నందున ఇతర కార్యక్రమాలను రద్దు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వివిధ జిల్లాకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు కృష్ణముదిరాజ్, పెందూరు మారుతి, శివన్న, అబ్దుల్ జహిద్, మామిడి లక్ష్మన్, శ్యాంసుందర్, పాలకొండ దత్తు, అత్రం వినోద్, దాసరి విలాస్, దుర్గం జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

'గాంధీ'లో నిఘా మరింత పటిష్టం



గాంధీ ఆస్పత్రిలో కమెండ్ కంట్రోల్ రూమ్, సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న దృశ్యం

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిఘా వ్యవస్థను మరింత పటిష్ట పర్చేందుకు మరిన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సీహెచ్ఎన్ రాజకుమారి, చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డిలు తెలిపారు. ఆస్పత్రి ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ రూమ్, నూతనంగా ఏర్పాటు చేసిన 28 నైట్‌విజన్ హైరెజల్యూషన్ సీసీ కెమెరాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు గాంధీ ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించడంతోపాటు రోగులు, రోగి సహాయకులు, వైద్యులు, సిబ్బందికి భద్రత, భరోసా కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయనున్నట్లు వివరించారు. అత్యవసర విభాగాలు, ఓపీ, ఆయా వార్డులు, విభాగాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మొత్తం 148 సీసీ కెమెరాలు ప్రస్తు తం అందుబాటులో ఉన్నాయన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీ కెమెరాల ఫుటేజీని నిరంతరం పరిశీలించి, అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు, సెక్యూరిటీగార్డులు, ఇతర సిబ్బందిని అప్రమత్తం చేసేందుకు ప్రత్యేక శిక్షణ పొందిన నిపుణులను నియమించనున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా అనేక క్లిష్టమైన కేసులను చేధించినట్లు చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సునీల్ కుమార్, ఆర్ఎంఓ-1 శేషాద్రి, చిలకలగూడ సీఐ అనుదీప్, గాంధీ సీసీ కెమెరా కమెండ్ కంట్రోల్‌రూమ్ నిర్వాహకుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న యాదవ యువ సేన చైర్మన్ కట్టెల శ్రీనివాస్‌యాదవ్

రాంగోపాల్‌పేట్: యాదవుల సదర్ సమ్మేళనం ప్రభుత్వం తరుపున నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటనతో తెలంగాణ యాదవ సేన హర్షం వ్యక్తం చేస్తూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. యాదవ సేన చైర్మన్ కట్టెల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులతో కలిసి పీజీరోడ్‌లోని ఆయన నివాసం వద్ద సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎంతో మంది ముఖ్యమంత్రుల వద్దకు ఈ డిమాండ్ తీసుకుని వెళ్లినా ఎవరు స్పందించలేదని రేవంత్‌రెడ్డి యాదవుల డిమాండ్ గుర్తించి స్పందించడం పట్ల యాదవ సమాజం మొత్తం ఎంతో రుణపడి ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు షేక్ గౌస్, యాదవ సేన ప్రతినిధులు నీలం శ్రీనివాస్‌యాదవ్, పెంద్యం శ్రీనివాస్‌యాదవ్, మెరుగు శ్రీనివాస్ యాదవ్, మల్లేష్ యాదవ్, డేగల శ్రీనివాస్‌యాదవ్, బోయిన కిషన్ యాదవ్, నాగుల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ ఆర్డీఓగా సాయిరామ్


బంజారాహిల్స్: రెవెన్యూ అధికారుల బదిలీల్లో భాగంగా సోమవారం సికింద్రాబాద్ ఆర్డీఓ దశరథ్‌సింగ్ హెచ్ఎండీఏ ఓఆర్ఆర్ స్పెషల్ కలెక్టర్ పీఏగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సికింద్రాబాద్ ఆర్డీఓగా పి.సాయిరామ్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు సాయిరామ్ చేవెళ్ల ఆర్డీఓగా పనిచేశారు. తాజా బదిలీల్లో చేవెళ్ల ఆర్డీఓగా హైదరాబాద్ ఎస్టేట్ అధికారి, షేక్‌పేట మండల మాజీ తహశీల్దార్ చంద్రకళ నియమితులయ్యారు. ఇదిలా ఉండగా సికింద్రాబాద్ ఆర్డీఓ పరిధి కిందికి షేక్‌పేట, ఖైరతాబాద్, ముషీరాబాద్, అమీర్‌పేట, హిమాయత్‌నగర్, సికింద్రాబాద్, మారేడ్‌పల్లి మండలాలు వస్తాయి.

భర్తపై బ్లేడుతో దాడి చేసిన భార్య

- ఫోన్‌లో ఎక్కువ మాట్లాడుతున్నందుకు నిలదీసిన భర్త..

అమీర్‌పేట: ఫోన్‌లో తరచూ ఎవరితో మాట్లాడుతున్నావని అడిగినందుకు ఆగ్రహంతో భార్య భర్తపై బ్లేడుతో దాడికి పాల్పడింది. ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. బల్కంపేటకు చెందిన చదల శివ (45), విజయ (38)కు 23 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 20 ఏళ్ల వయసున్న కూతురు, 17 సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. అయితే ఇటీవల విజయ వేరొకరితో ఫోన్లో ఎక్కువగా మాట్లాడుతున్నట్లు శివ గుర్తించాడు.ఈ నెల 26వ తేదీన రాత్రి కూడా భర్త ఇంట్లో ఉన్న సమయంలోనే భార్య వేరొకరితో ఫోన్లో మాట్లాడుతుండటంతో అనుమానించి శివ నిలదీశాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో షేవింగ్ బ్లేడ్‌తో భర్తపై విజయ దాడి చేసింది. తీవ్ర గాయమై రక్తస్రావం జరగడంతో స్థానికులు శివను ఆసుపత్రికి తరలించారు.ఆదివారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతన్నారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య



మధు మృతదేహం

బన్సీలాల్‌పేట్: జీవితంపై విరక్తిచెందిన ఓ యువకుడు విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గాంధీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. కవాడిగూడ ముగ్గుబస్తీకి చెందిన మధు(34) రాణిగంజ్‌లోని ఓ హార్డ్‌వేర్ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఒంటరిగా ఉంటున్న మధు జీవితంపై విరక్తితోనే గుర్తు తెలియని విషయం సేవించి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న గాంధీనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సోదరి చంద్రిక ఫిర్యాదు మేరకు గాంధీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు

తప్పక పాటించాలి



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఏసీపీ శంకర్‌రాజు

రాంగోపాల్‌పేట్: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించి పోలీసులకు సహకరించాలని నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు సూచించారు. సోమవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ముందు ఆటో డ్రైవర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ యూనిఫాం ధరించాలని, నంబర్ ప్లేట్స్ సక్రమంగా ఉండేలా చూసుకోవాలని, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని చెప్పారు. ప్రయాణికులతో మర్యాదగా మాట్లాడాలని, అధనపు చార్జీలు వసూలు చేయవద్దని చెప్పారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో రోడ్లపైన, రోడ్ల పక్కన ఆపి ట్రాఫిక్‌కు ఇబ్బందులు సృష్టించవద్దన్నారు. బయటి జిల్లాల నుంచి వచ్చే ఆటోల ప్రవేశం, నియంత్రణ గురించి ఆటో డ్రైవర్లతో చర్చించారు.